# అప్పన్న మాస్టారి అనుభవాలు

అప్పన్న మాస్టారు అందరివంటి వాడు కాదు. పిల్లలేమన్నా అల్లరిచేస్తే కస్సుబుస్సు మనక ఆ అల్లరిలో ఉన్న హాస్యానికి ఆనందించే అమాయకుడు. అందుకని ఆయనంటే అందరికి చనువు. ఆయన క్లాసులో కూర్చుని పాఠం వినటం అంటే అదో ఆట.

ఒక మాటు

ఒక కుఱ్రవాడు ఆరునెలల పరీక్షలో పక్కవాడు వ్రాసేదానిలో నుంచి కాపీ చేస్తున్నాడు. ఆ సంగతి ఈయన కనిపెట్టాడు ఇంకో మాస్టరు అయితే హాత్ - హుత్ అంటూ ఆ కుఱ్రాడ్ని పట్టుకొని అవతలికి పంపేవాడే. కాని అప్పన్న మాస్టారు అట్లా చేయలేదు. చేయక అన్నాడూ, "ఏమోయ్, ఈ వెధవ పరీక్షలో కూడా కాపీ చెయ్యాలా, ఇందులో మార్కులు వస్తే ఎంత రాకపోతే ఎంత, ఈ భాగ్యానికి ఇంత అసహ్యమైన పనికి లోబడ్డావు ఏమి కర్మం. రేపు యస్.యస్.ఎల్.సి. గవర్నమెంటు పరీక్ష వస్తుంది. అప్పుడు ఒకవేళ కాపీ పట్టుబడి చేయగలిగితే పరువు పోయినా, ఫలితం దక్కుతుంది, అని చీవాట్లు పెట్టాడు. ఆ మాటలు విని, ఆ కుఱ్రాడంటాడూ అవునండీ అందుకనే ఆ పనిలో అనుభవం సంపాదిస్తున్నాని : పిడుగులాంటి మాట అన్నాడని అప్పన్న మాస్టారు ఆనందించారు కాని ఆగ్రహించలేదు.

మరో మాటూ -

ఏదో ఒక కుఱ్రాడు మాట్లాడుతుంటే, అప్పన్న శాస్త్రి అన్నాడు, ఏమోయ్ నే చెప్పేది వినకుండా పక్కవాడితో మాట్లాడుతున్నావు. ధర్మమా? అని కుఱ్రాడూ నే మాట్లాడటం లేదండీ, వాడు ఏదో చెబుతుంటే వింటున్నానండి అని అన్నాడు. అప్పన్న మాస్టారు పాపం కోపం అంటూ ఎరగరుగా, అందుకని ఆదరంగా అన్నారూ, అట్లా కాదోయ్, ఇక్కడ నే చెప్పేదే వినాలె. వాడూ వాడూ చెప్పింది వినకూడదు అని. ఇంత సరసంగా మాస్టరైనవాడు అన్నప్పుడు విద్యార్థి సాధారణంగా జవాబు ఏమీ చెప్పడు. కాని ఆ చిన్నవాడు చప్పున "క్షమించాలి మాస్టారు వినదగు నెవ్వరు చెప్పిన' అన్నాడు. ఆ మాటకు మాస్టారు నవ్వారు. అంతా నవ్వారు.

ఇంకో మాటూ -

మరో తమాషా జరిగింది. అప్పన్న మాస్టారికి కొద్దిగా నత్తి ఉంది. ఎప్పుడో బాగా భావోద్రేకం కలిగినపుడు స్వల్పంగా కనపడుతుంది. సంవత్సరం మొదటిరోజులలో సంగతీ... కుర్రాళ్ళు ఇంకా పరిచయం కాలేదు. మాస్టరు మంచివాడని, బాగా చెప్పగలవాడనీ అనిపించుకోవాలంటే మొదటి రోజులలో ప్రథమ పరిచయ సందర్భంలోనే బాగా చెప్పి మెప్పును పొందాలె. మొదట్లో అల్లరి పడ్డాడా ఇక ఆ సంవత్సరానికి అంతే ఆ మాస్టరు గతి. అందుకని అప్పన్న మాస్టారు అద్భుతంగా చెపుతున్నాడు. ఆ రోజు పాఠం నెపోలియన్ పద్దెనిమిది వందల నాలుగు అయిదులలో యూరపునంతా గడగడలాడించటం దేశదేశాలను జయించి లోక కంటకం కావటం చెప్పి, రష్యాపై దండయాత్ర సంగతి చెపుతూ మాస్కో పట్టణాన్ని రష్యనులు తగలబెట్టిన ఘట్టం దగ్గరి కొచ్చేటప్పటికి ఆయనకు కొంచెం నత్తివచ్చి "తమ పట్టణాలను త్‌త్‌త్ గులబెట్టి రష్యనులు పారిపోయినారన్నాడు.

అపుడు ఒక కుర్రాడికి ఒక సందేహం కలిగింది. ఏమనీ? రష్యనులు తమ పట్టణాన్ని తామే ఎందుకు తగలబెట్టుకున్నారూ అనీ, ఈ సందేహం బాధించింది కామాలు. ఆ కుర్రాడు చప్పున నిలబడి ఉమ్ - మ్మాస్టారూ ర్‌ర్‌ర్ ష్యనులు వాళ్లే ఎ ఎ ఎందుకు త్ త్ త్ త్ తగల బెట్టుకుంటారండీ అన్నాడు. అంతా గొల్లున నవ్వారు. పాఠం నడక పాడైపోయింది. మాస్టారికి కొద్దిగా కోపం వచ్చింది. ఆయన, నన్ను వెక్కిరిస్తున్నావటోయ్ అన్నారు. నిజానికి ఆయనంటే అందరికీ గౌరవము, భక్తీ ఉన్నాయి. అందుకని పాపం ఆయనా మాట అనేసరికి అందరూ నొచ్చుకొని విచారపడి ఎవడురా, వీడు మాస్టార్ని వెక్కిరించాడూ అన్న అసహ్యభావంతో వాడివంక చూశారు. మాస్టరుగారి మనస్సు కష్టపెట్టానే అని వాడికి కష్టమయింది కాబోలు. పాపం వాడు విచారంగా మా దీనంగానూ అన్నాడు. మిమ్మల్ని ఎఎ ఎక్కిరించిందాకా న నన న నాకు ఖ్‌ఖ్‌ఖ్ ఖర్మంటే నన నాకు నత్తి లేకపోతే గదా, అని. పాపం నిజంగా వాడికి నత్తి.

ఇక చూడండి మాస్టారూ, పిల్లలతో సహా అంతా గొల్లుమన్నారు.

*('వీణ' మాసపత్రిక, అక్టోబర్ 1937)*